
సాక్షి ఒడిశా

మంగళవారం । 2 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,47,178లు, బంగారం 600మిల్లీగ్రాములు, వెండి 8.2 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



అరుణ పతాక రెపరెపలు

● ఘనంగా మే డే వేడుకలు

- 8లో



రికార్డు స్థాయిలో జీఎస్టీ ఆదాయం

- 8లో

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మృతులు చింటు గౌడా(8), సంతోష్ ప్రధాన్(23)గా పోలీసులు గుర్తించారు. చింటు, సంతోష్ బైక్‌పై సమీపంలోని అచవ గ్రామానికి వెళ్తున్న సమయంలో విక్రమంపూర్ కూడలిలో ఎదురుగా వస్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం సంభవించిందని స్థానికులు ఆరోపిస్తూ బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని ఆందోళనకు దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి, వారికి నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమనిగింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసారు.

ఆటో–కారు ఢీకొని..

బరంపురం: నగరానికి సమీపంలోని కోనిసి గ్రామం వద్ద ఎదురెదురుగా వస్తున్న ఆటో–కారు ఢీకొని, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గొళంతరా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఎంకేసీజీ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఐఐసీ అధికారి తపస్‌కుమార్ నాయక్ తెలిపారు.

మత్తిలిలో మరొకరు..



మత్తిలి ఆరోగ్య కేంద్రం రాహుల్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి భమాన్ గూఢ గ్రామం సారా బట్టీలో వంట కార్మికుడిగా పనిచేస్తున్న రాహుల్‌కుమార్(28)ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఔరంగబాద్‌కు చెందిన రాహుల్ స్థానికంగా ఉన్న సారా బట్టీలో గత కొంతకాలంగా వంట చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ తరహాలోనే ఆదివారం కూడా పనికి వెళ్లిన అతను.. రాత్రి 10గంటల సమయంలో బైక్ అదుపు తప్పి నెమ్‌బోర్డును ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలై, మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునారు.

జైలును సందర్శించిన న్యాయమూర్తి



బాలునికి ఆల్ట్రాసౌండ్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

జయపురం: గత రెండు రోజులుగా కొరాపుట్ జిల్లా న్యాయసేవా ప్రాధికరణ కార్యదర్శి సుమన్ జెనా వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. జిల్లాలో శిశురక్షణ కేంద్రణ, ఖైదీల సామాజిక పరిస్థితులపై దృష్టి సారించారని న్యాయసేవా విభాగ అధికారులను ఆదేశించారు. కొరాపుట్ సర్కిల్ జైలు, జయపురం సబ్ జైలు, కొట్‌పాడ్ సబ్ జైళ్లను సందర్శించారు. వివిధ నేరాల్లో జైలు జీవితం గడుపుతున్న ఖైదీల పరిస్థితిని తెలుసుకున్నారు. ఖైదీలను స్వయంగా కలసి వారికి ఇస్తున్న భోజనం, అందుతున్న వైద్యసాయం, పరిశుభ్రత తదితర విషయాలపై ఖైదీల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగనే వారి పై ఉన్న కేసుల వివరాలు తెలుసుకొన్నారు. ఖైదీలకు ఎటువంటి చట్టపరమైన సమస్యలు వచ్చినా జైలును సందర్శించేందుకు వచ్చిన ప్యానెల్ న్యాయవాది, పారాలీగల్ ప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. అలాగే ఆయన జిల్లాలోని డుమురిపుట్ సాలమ్ శిశురక్షణ పర్యవేక్షణ కేంద్రాన్ని సందర్శించారు.

కన్యకా పరమేశ్వరికి పూజలు



కలశయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

జయపురం: కళింగ వైశ్యుల ఆరాధ్యదైవం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు జయపురంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వందలాది మంది మహిళలు చారిత్రాత్మక జగన్నాథ్ సాగర్‌కు వెళ్లి, మంగళ వాయిధ్యాల మధ్య కలశాలలో పవిత్ర జలాలను జయపురం మహారాణిపేటలో ఉన్న అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కన్యకా పరమేశ్వరి నిలువెత్తు చిత్రపటాన్ని రథంపై ఊరేగించారు. వందలాది మంది భక్తులు పాల్గొనగా, సుమారు 3వేల మందికి అన్నప్రసాదం అందజేశారు.

విన్నపాలు వినవలే..

● రాయగడ, పర్లాకిమిడి గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ
● హాజరైన కలెక్టర్లు స్వాధాదేవ్, లింగరాజ్
● క్రీడాశాఖ అధికారి తీరుపై మండిపాటు



సీడీఎంతో చర్చిస్తున్న ఏఎన్‌ఎం అభ్యర్థులు



జిల్లా క్రీడాశాఖ అధికారిని ప్రశ్నిస్తున్న కలెక్టర్ సింగ్, పక్కన ఎస్పీ శర్మ

రాయగడ: జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ అధ్యక్షత వహించారు. ఎస్పీ వివేకానంద శర్మ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రవినారాయణ త్రిపాఠి, జిల్లా ముఖ్యవైద్యాధికారి లాల్‌మోహన్ రౌత్రాయ్, జిల్లా సంక్షేమశాఖ అధికారి అశోక్‌కుమార్ సత్పతి, జిల్లా విద్యాశాఖ అధికారి పూర్ణచంద్ర భొరియా తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను కలెక్టర్ స్వీకరించారు. మొత్తం 31 వినతులు రాగా.. ఇందులో 24 వ్యక్తిగతం, 7 గ్రామ సమస్యలుగా గుర్తించారు.

10రోజుల్లో ఏర్పాటు చేయాలి..

వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు క్రీడారంగంలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం లభించడం లేదని, రద్దయిన జిల్లా అథ్లెటిక్స్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఇప్పటి వరకు ఏర్పాటు కాలేదని తెలియజేశారు. దీనిపై ఆమె జిల్లా క్రీడాశాఖ అధికారి షేక్ ఆలీనూర్‌ను ప్రశ్నించారు. ఇంతవరకు అసోసియేషన్ కార్యవర్గం ఎందుకు ఏర్పాటు చేయలేదని నిలదీశారు. దీనికి ఆయన నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అసహనం వ్యక్తంచేసిన కలెక్టర్.. 10రోజుల్లో కొత్త కార్యవర్గం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా క్రీడాకారులకు ప్రోత్సాహం, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే వివిధ పోటీలకు క్రీడాకారుల ఎంపిక విషయంలో పక్షపాత వైఖరి మార్చుకోవాలని, మరోసారి ఇటువంటి ఆరోపణలు పునరావృతమైతే చర్యలు తప్పవని స్పష్టంచేశారు. క్రీడారంగాన్ని అభివృద్ధి చేసి, క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలన్న ప్రభుత్వ ఆశయాన్ని విస్మరిస్తే సహించేదిలేదన్నారు.

ఏఎన్‌ఎంల నిమామకంపై..

గతనెల 29న రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ క్రమంలో 30 జిల్లాల్లో కేవలం 29 జిల్లాల్లోనే నోటిఫికేషన్ జారీ చేయడం, రాయగడ జిల్లాను అందులో పొందుపర్చక పోవడంపై ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. అన్ని జిల్లాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం రాయగడ జిల్లాలోని ఖాళీలను ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. జిల్లా ముఖ్యవైద్యాధికారి ఈ సమస్యను పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 316 ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దర్యాప్తు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. కోవిడ్ వంటి సమయంలో ప్రాణాలకు సైతం తెగించి సేవలందించిన తమను ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఈ సందర్భంగా రచన పతి, సబిత సబర్, జి.సుజాతలు సీడీఎంఓను నిలదీశారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



పర్లాకిమిడి: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: స్థానిక కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు కలెక్టర్ లింగరాజ్ పండా అధ్యక్షత వహించారు. జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జిల్లా ముఖ్య అభివృద్ధి అధికారి(డీఆర్‌డీఏ) రమాంచల్ ఖమారి, ఏడీఎం బీరేంద్ర కుమార్ దాస్, డిప్యూటీ కలెక్టర్ రాజేంద్ర మింజా, జిల్లా సమగ్ర గ్రామీణాభివృద్ధి పీడీ ఫాల్గుణీ మాఝి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాణిపేట, పర్లాకిమిడి మున్సిపల్, బాగుసాల, కత్తలకవిటి, కెరండి, సిద్ధమణుగు పంచాయతీల నుంచి 39 వినతులు అందాయి. వీటిలో గ్రామ సమస్యలు 9, 30 వ్యక్తిగతమైనవిగా గుర్తించారు. 6 వినతులకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.12 వేల చొప్పున్న నిస్సహాయులకు అందజేశారు. నోడల్ అధికారి నర్మదా నాయక్, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాత్రో, జిల్లా సామాజిక సంక్షేమశాఖ అధికారి సంతోష్‌కుమార్ నాయక్, డీడబ్ల్యూఓ సంతోష్‌కుమార్ రథో తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన



ర్యాలీ నిర్వహిస్తున్న ఒప్పంద ఉపాధ్యాయులు

రాయగడ: ఉన్నత పాఠశాలలో ఒప్పంద ఉపాధ్యయులుగా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒప్పంద ఉపాధ్యాయుల సంఘం ఆందోళన చేపట్టింది. ఈ మేరకు స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి, కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రప్రభుత్వ ఆధీనంలోని ఉన్నత పాఠశాలలో 2016 నుంచి విధులు నిర్వహిస్తున్న వారిని రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని.. 2004లో విధుల్లో చేరిన ఒప్పంద ఉద్యోగులకు కూడా ఈ నోటిఫికేషన్ వర్తింపజేయాలని కోరారు.

పథకాలపై పర్యవేక్షణ ఏదీ?



ఎమ్మెల్యే మకరంద ముదులి

రాయగడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు జిల్లా యంత్రాంగం పనితీరుపై స్థానిక ఎమ్మెల్యే మకరంద ముదులి తొలిసారిగా విరుచుకుపడ్డారు. స్వతంత్ర అభ్యర్థిగా 2019లో రాయగడ శాసనసభ నుంచి విజయం సాధించిన ముదులి ఇప్పటి వరకు ప్రభుత్వానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు పలుకుతూ వస్తుండేవారు. అయితే పట్టణంలోని అశోక్ మండపంలో సోమవారం జరిగిన అంతర్జాతీయ కార్మిక దినోత్సవ సభలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం ప్రవేశ పెడుతున్న పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని విమర్శించారు. ప్రవేశ పెడుతున్న పథకాలు ప్రజలకు సక్రమంగా వినియోగ పడుతున్నాయా లేదా అనే విషయంపై ఎటువంటి సమీక్షలు నిర్వహించక పోవడంతో సంబంధిత శాఖ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని సభా సమక్షంగా ఆరోపించారు. అధికారులు అవినీతికి పాల్పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని, కొన్ని శాఖల్లో అవినీతి వ్యవహారం మితిమీరిపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. సభా వేదికపైనే ఈ విధంగా ప్రసంగించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయ మాఝి, జిల్లా కార్మికశాఖ అధికారి జాస్మిన్ సాహు తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి కేరాఫ్.. ఎంజీఎన్‌ఆర్‌ఈజీసీ!

జిల్లాలో అమలవుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అవినీతి తారాస్థాయికి చేరుకుందని ఎమ్మెల్యే ముదులి ఈ సందర్భంగా దుయ్యబట్టారు. ఎంతోమంది ఆదివాసీ, హరిజన ప్రజలు కూలి పనుల కోసం ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారని, అటువంటి వారికి అండగా నిలిచేందుకే ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశ పెట్టారని గుర్తుచేశారు. అయితే రాయగడ జిల్లాలో పథకం పూర్తిగా నిర్వర్యమైందని, అయినా జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విచారం వ్యక్తంచేశారు. కొద్ది నెలల క్రితం పనుల్లో అవినీతికి పాల్పడిన ఓ అధికారి విజిలెన్స్ అధికారులకు చిక్కుకున్నారన్న సభ దృష్టికి తీసుకువచ్చారు. వాస్తవ లబ్ధిదారులకు ఎటువంటి న్యాయం జరగడం లేదని, దీంతో పనిలో భాగస్వాములయ్యేందుకు ఏఒక్కరూ ముందుకు రావడం లేదన్నారు. ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి దోహదపడాల్సిన పథకం.. అధికారులు మాత్రం రూ.కోట్లు సంపాదించి పెడుతోందని విమర్శించారు. అదేవిధంగా జిల్లా వాటర్‌షెడ్ శాఖ కూడా ఏమాత్రం తీసిపోదని పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ప్రతి సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వానికి వత్తాసు పలికే ముదులి.. ఇలా ఆరోపణలు చేయడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



పూజల నిర్వహిస్తున్న రాంజీ ఆచార్యులు

రాయగడ: స్థానిక బాలాజీనగర్ లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రత పూజలు చేపట్టారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం విశేష కుంకుమ పూజలు జరిగాయి.

కలానికి విరామం!

● సీనియర్ పాత్రికేయుడు బాసుదేవ్ మహపాత్రో మృతి



బాసుదేవ్ మహపాత్రో(ఫైల్)

భువనేశ్వర్: ప్రముఖ పాత్రికేయుడు, రచయిత బాసుదేవ్ మహపాత్రో సోమవారం కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం తీవ్రమైన ఛాతీనొప్పి రావడంతో స్థానిక క్యాపిటల్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. పేదల పక్షాన నిలవడంతో పాటు ఎన్నో కథనాలతో అన్ని వర్గాల హృదయాలను దోచుకున్న పాత్రికేయుడుగా పేరొందారు. పర్యావరణ జర్నలిజంలో కూడా సముచిత స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ఖుర్దా జిల్లా బలుగాంవ్‌లో జన్మించిన బాసుదేవ్.. బరంపురం విశ్వవిద్యాలయం నుంచి చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ప్రతిష్టాత్మక మీడియా సంస్థల్లో పని చేశారు. వార్తాపత్రిక సామాన్య జర్నలిస్ట్‌గా తన వృత్తిని ప్రారంభించి, పాత్రికేయ రంగంలో అంచెలంచెలుగా ఎదిగారు. రాష్ట్రంలోని ప్రముఖ మీడియా సంస్థల్లో ఉన్నత హోదాల్లో కీలకమైన బాధ్యతలు విజయవంతంగా నిర్వహించారు. ఆయన రచనలు, ప్రచురణలు ప్రతిష్టాత్మక గుర్తింపు సాధించాయి. సంపాదకీయాలు ప్రముఖుల ఆదరణ నోచుకున్నాయి. వైజ్ఞానిక, సుస్థిరత పట్ల మక్కువతో పలు ఆసక్తికరమైన విషయాలపై అనేక వ్యాసాలు రాశారు. సొంత వెబ్‌న్యూస్ పోర్టల్‌ను జయప్రదంగా నిర్వహించారు. దివంగత మహపాత్రో తన కెరీర్‌లో వివిధ జాతీయ, ప్రాంతీయ మీడియా సంస్థలకు స్వతంత్ర జర్నలిస్ట్‌గా పని చేశారు.ఇంగ్లిష్, ఒడియా రెండింటిలోనూ పాత్రికేయ నైపుణ్యంతో తన ప్రగతిశీల, విశ్లేషణాత్మక వార్తలకు ప్రసిద్ధి చెందాడు. మహపాత్రో భార్య సుజాత సైతం పాత్రికేయురాలు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. మహపాత్రో అకాల మృతి పట్ల మీడియా ప్రతినిధులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

ఎస్‌ఈబీసీ సర్వే ఆరంభం

● రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 27 వరకు కొనసాగింపు
● ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వివరాల నమోదుకు అవకాశం



సర్వే కేంద్రంలో ఎస్‌ఈబీసీ వివరాల నమోదు చేస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇతర వెనుకబడిన తరగతుల(ఎస్‌ఈబీసీ) సర్వే రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈనెల 27 వరకు ఈ సర్వే ప్రక్రియ నిరవధికంగా కొనసాగుతుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈ సర్వే నిర్వహిస్తారు. దేశంలో బీహార్ తర్వాత ఈ సర్వే నిర్వహిస్తున్న రెండో రాష్ట్రం ఒడిశా కావడం విశేషం. ఆన్‌లైన్ విధానంలో కుటుంబ యజమాని లేదా కుటుంబంలో పెద్ద వయస్కులు, ఆఫ్‌లైన్ నమోదులో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఎస్‌ఈబీసీ సర్వే కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో సర్వే నమోదుకు అవసరమైన కుటుంబ వివరాలు దాఖలు చేయాల్సి ఉంటుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులను ఎన్యూమరేటర్లుగా నియమితులయ్యారు. ఈ సదుపాయం స్థానికంగా పని చేస్తున్న మోసేవా కేంద్రంలో లభ్యం అవుతుంది. ఈ కేంద్రాల్లో నిర్ధారిత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ప్రజలు బీసీ కమిషన్ ఓఓటీ. ాబఛి. ాచీజీఓ్బ. జౌకి. జీ వెబ్‌సైట్‌ను సందర్శించి, వారి డేటాను అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్ మాధ్యమంలో సర్వే సంబంధిత సమాచారం నమోదు చేసుకునేందుకు వీలవుతుంది. ఈ ప్రక్రియలో సామాజిక, విద్యాపరమైన అంశాలకు సంబంధించిన ప్రశ్నలతో పాటు, వారి రేషన్, ఆధార్ కార్డులు లేదా వారి కుటుంబ సభ్యుల ఓటరు గుర్తింపు కార్డుల వివరాలను వెబ్‌సైట్‌లో దాఖలు చేయాల్సి వస్తుంది. రేషన్ కార్డులు లేని ఇతర వెనకబడిన కులాల కుటుంబాలు కూడా తమ వివరాలను సర్వే కేంద్రాల్లో సమర్పించవచ్చు. సర్వే కేంద్రాలు పని దినాలలో నిత్యం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తెరిచి ఉంటాయి. ఒడిశా స్టేట్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్(ఓఎస్‌సీబీసీ) చట్టం, 1993, ఓఎస్‌సీబీసీ(సవరణ) చట్టం, 2020లోని సెక్షన్ 9 కింద సర్వే నిర్వహించనున్నట్లు ఈ ఏడాది మార్చి 16న రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సర్వేలో ఎవరు బయట పడకుండా ఓబీసీ వర్గాల సామాజిక, విద్యాపరమైన పరిస్థితుల సేకరణ ఈనెల 20నాటికి పూర్తి చేయాలని ఉత్తర్వులు పేర్కొన్నాయి. రాష్ట్రప్రభుత్వం గుర్తించిన 208 ఓబీసీ కమ్యూనిటీల సామాజిక, విద్యార్హతల స్థితిగతులు సర్వేలో సేకరిస్తారు. ఒడిశా రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా 314 మండలాలు, 114 పట్టణ, నగరపాలక సంస్థలు(యూఎల్‌బీ) ప్రాంతాల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా సర్వే నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో సర్వే గణాంక వర్గాలకు ప్రత్యేక శిక్షణ అంచెలంచెలుగా కల్పించిన విషయం తెలిసిందే.

అంతకుముందు.. ఆ తర్వాత!

● ఝార్సుగుడ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అశోక్‌కుమార్ రాజీనామా
● ఉప ఎన్నిక ప్రచారంలో సరైన ప్రణాళిక లేదంటూ కినుక
● ఉదయం రాజీనామా ప్రకటన.. సాయంత్రం ఉపసంహరణ



విలేకర్లతో మాట్లాడుతున్న అశోక్‌కుమార్ మిశ్రా

భువనేశ్వర్: కాంగ్రెస్ పార్టీ ఝార్సుగుడ జిల్లాశాఖ అధ్యక్షుడు అశోక్‌కుమార్ మిశ్రా రాజీనామా చేశారు. ఝార్సుగుడ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక సమీపిస్తున్న తరుణంలో ఆయన పదవి నుంచి వైదొలగడం జిల్లా రాజకీయ శిబిరాల్లో చర్చనీయాంశమైంది. ప్రధానంగా రాష్ట్ర కాంగ్రెస్ శిబిరంలో ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది. తన రాజీనామా లేఖను ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్‌కు పంపారు. ఈ నేపథ్యంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ వర్గాలకు సమాచారం చేరవేశారు. ఝార్సుగుడ జిల్లాశాఖ అధ్యక్ష పదవికి మాత్రమే రాజీనామా చేశానని, పార్టీలోనే కొనసాగుతున్నానని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. రాజీనామా నిర్ణయం పట్ల ఖచ్చితమైన కారణం స్పష్టం కాలేదు. ఈ దిశలో రాజకీయ వర్గాల్లో పలు విధాలుగా చర్చ కొనసాగుతోంది. ఈనెల 10న జరగనున్న ఝార్సుగుడ ఉప ఎన్నికకు సంబంధించి పార్టీ నాయకులు అతనిని సంప్రదించక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై, ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు అంతా భావిస్తున్నారు.

తండ్రి మరణంతో సానుభూతి..!

ఉప ఎన్నికలో అశోక్‌కుమార్ మిశ్రా పార్టీ టిక్కెట్‌ను ఆశించి నిరుత్సాహానికి గురయ్యారు. ఉప ఎన్నిక కోసం కాంగ్రెస్ తరుణ్ పాండే అభ్యర్థిత్వాన్ని పోటీకి ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఆయన తండ్రి భీరేన్ పాండే నియోజకవర్గంలో అత్యంత ప్రజాదరణ పొందిన వ్యక్తి. గతంలో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తండ్రి మరణంతో తనయుడిగా తరుణ్‌కు సానుభూతి ఓట్లు కలిసి వస్తాయనే దృక్పథంతో అధిష్టానం ఉప ఎన్నిక టికెట్ కట్టబెట్టింది. ప్రావిన్షియల్ కాంగ్రెస్ కమిటీకి చెందిన ఐదుగురు సభ్యుల బృందం ఝార్సుగుడలో పర్యటించి, గెలుపు అవకాశాలు కలిగిన అభ్యర్థుల జాబితా ఖరారు చేసింది. ఈ కమిటీ ఆరుగురు అభ్యర్థుల వివరాలతో గెలుపు గుర్రాల ప్రతిపాదిత జాబితా పార్టీ అధిష్టానానికి దాఖలు చేసింది. ఈ జాబితాలో ఝార్సుగుడ జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్ మిశ్రా పేరు చోటు దక్కలేదు. క్షేత్రస్థాయి సమీక్ష నివేదిక ఆధారంగా తరుణ్‌పాండే అభ్యర్థిత్వానికి ఏఐసీసీ అధిష్టానం ముద్ర వేసింది. తరుణ్ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి తొలి పరిచయం. ఆయనకు అధిష్టానం బరిలోకి దింపేందుకు మక్కువ కనబరచడం విశేషం. ఈ పరిస్థితుల్లో ఝార్సుగుడ నియోజకవర్గ ఉప ఎన్నిక పోటీకి కాంగ్రెస్ టికెటు ఆశావాది అశోక్‌కుమార్ మిశ్రా మనస్తాపానికి గురయ్యారు. జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వాన్ని కలిగి ఉన్నానని, ఇప్పటికీ కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నానని వివరించారు.



అశోక్‌కుమార్ మిశ్రా

గంటల వ్యవధి లోనే..

ఇదంతా జరిగిన గంటల వ్యవధిలోనే తన రాజీనామా నిర్ణయం ఉపసంహరించుకుంటున్నట్లు అశోక్‌కుమార్ మిశ్రా ప్రకటించారు. ఈ మేరకు ఝార్సుగుడలో సోమవారం సాయంత్రం హడావుడిగా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఓపీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ ప్రత్యక్ష జోక్యంతో తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్న తెలిపారు. ఉప ఎన్నిక కోసం పార్టీ ప్రచార ప్రణాళికకు సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నందున రాజీనామా సమర్పించినట్లు వివరించారు. అయితే ఈ విషయంలో శరత్ పట్నాయక్ ప్రత్యక్షంగా చొరవ కల్పించుకుని పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో నిర్ణయం మార్చుకున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

రోగులకు భోజన సదుపాయం

సీతంపేట: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రి రోగులకు సోమవారం నుంచి భోజన సదుపాయం కల్పించారు. ప్రతిరోజు రోగితో పాటు సహాయకులకు రుచికరమైన భోజనం వడ్డిస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. తొలిరోజు 70 మందికి భోజనాలు వడ్డించామన్నారు. గర్భిణులు, చిన్నారులకు ప్రత్యేక మెనూ అమలు చేస్తామని చెప్పారు.

భూముల రీసర్వే పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని శిఖబడిలో నిర్వహిస్తున్న భూముల రీసర్వే తీరును పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ సోమవారం పరిశీలించారు. కొలతలు, హద్దురాళ్ల ఏర్పాటు తదితర వివరాలను తహసీల్దార్ కె.వి. సీతారామయ్యను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, ఎటువంటి తగాదాలకు తావులేకుండా ఉండాలన్నారు.

దాడితల్లికి 108 కిలోల లడ్డూ నైవేద్యం



దాడితల్లికి నైవేద్యంగా సమర్పించేందుకు సిద్ధం చేసిన 108 కిలోల లడ్డూ

బొబ్బిలి: పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం జరగనుంది. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రత్యేకంగా పులిహోరాతో పాటు 108 కిలోల లడ్డూను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించనున్నారు. లడ్డూ ప్రసాదాన్ని అమ్మవారి సన్నిధిలో ఉంచి సిరిమానోత్సవం సందర్భంగా భక్తులకు పంపిణీ చేయనున్నామని అర్చకులు పిండిప్రోలు మణికుమార్‌శర్మ తెలిపారు.

అకాల వర్షాలతో ఆందోళన



ఉద్దవోల్లో నువ్వు పంటను టార్పాలిన్లతో కప్పిన రైతులు

గరుగుబిల్లి: అకాల వర్షాలతో రైతులు సర్వత్రా ఆందోళన చెందుతున్నారు. గరుగుబిల్లి మండలంలోని గరుగుబిల్లి, ఉద్దవోలు, పెద్దూరు, బీవీపురం తదితర గ్రామాల్లో నువ్వుపంట కోతకు వచ్చింది. ఈ సమయంలో కురిసిన వర్షాలతో పంట పాడవుతుందని రైతులు చెబుతున్నారు. కోసిన చేనును దిబ్బలుగా చేర్చి టార్పాలిన్లతో కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

10న జాబ్‌మేళా

పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సీఎల్ టెక్నాలజీ సంయుక్తంగా టెక్-బి ప్రోగ్రామ్‌కు సెలక్షన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి యు.సాయికుమార్, డీవీఈఓ మంజుల వీణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ 2021-2022లో 60 శాతం, 2022-2023లో 75 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు జాబ్‌మేళాకు అర్హులుగా పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి పార్వతీపురంలోని వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుందన్నారు. ఈ డ్రైవ్‌కు హెచ్‌సీఎల్ టెక్నాలజీ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9182398325 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కలెక్టరేట్ వద్ద వ్యక్తి ఆత్మహత్యాయత్నం



కలెక్టరేట్ ప్రాంగణంలో ఆత్మహత్యాయత్నం చేసుకున్న వ్యక్తి

విజయనగరం అర్బన్: విజయనగరం కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం ఘటన కలకలం రేపింది. అద్దం గాజుముక్కతో మెడపై గాయం చేసుకొని రక్తం మడుగులో అక్కడికక్కడే కూలిపోయాడు. వివరాల్లోకి వెళితే... కలెక్టరేట్‌లోని ఇన్‌సైడ్ పార్క్ ప్రాంగణంలో ఉదయం 8.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి రక్తం మడుగులో నేలపై పడి ఉండడాన్ని నైట్ డ్యూటీలో ఉన్న అటెండర్ చూసి ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన గొంతుకు వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఆయన పేరు వీర్కుమార్ అలియాస్ సన్నీ, తండ్రి దసాహేడోరా అనియూ, బిలంగపదర్ గ్రామం, రాయగడ మండలం, ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.



జయపురం: మిలిత నిర్మాణ శ్రామిక సంఘం కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలారాయ్



జయపురం: మేడే ఉత్సవాల్లో పాల్గొన్న కార్మికులు



పర్లాకిమిడి: రాజవీధిలో సీఐటీయూ కార్మికుల ర్యాలీ

అరుణ పతాక రెపరెపలు

- ఘనంగా మే డే వేడుకలు
- కార్మిక జెండా ఎగుర వేసిన వివిధ సంఘాల ప్రతినిధులు

శ్రమదోపిడీని నిరసిస్తూ, ప్రపంచ కార్మికులకు స్ఫూర్తినిస్తూ సోమవారం చేపట్టిన మే డే వేడుకలు ఘనంగా సాగాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రజా, కార్మిక సంఘాల నాయకులు అరుణ పతకాన్ని ఎగుర వేశారు. అమరులైన కార్మికుల త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. కార్మికుల హక్కులు, సంక్షేమంపై గళం విప్పారు. సమాజ పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమేనని.. పనికి తగ్గ వేతనం, వారి సంక్షేమానికి తగిన ప్రాధాన్యమివ్వడమే మనమిచ్చే నిజమైన గౌరవమని తెలిపారు. - సాక్షి నెట్‌వర్క్



రాయగడ: సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సింగ్, ఎస్పీ శర్మ



రాయగడ: గుణుపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐసీటీయూ ప్రతినిధులు



జయపురం: రాజమేస్త్రి సంఘం నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్



పర్లాకిమిడి: కొత్త బస్టాండ్ నుంచి ర్యాలీ



పర్లాకిమిడి: అంతర్జాతీయ శ్రామిక దినోత్సవంలో పాల్గొన్న మహిళా కార్మికులు



పర్లాకిమిడి: భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు చెక్కులు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు, మోహానా ఎమ్మెల్యే దాశరథి గమాంగో



జయపురం: న్యాయ సచేతన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

గాజు ముక్కలు మింగి..



చికిత్స పొందుతున్న దారుల్లి

పార్వతీపురం: భర్త మందలించడాని మనస్తాపం చెందిన ఓ మహిళ గాజు ముక్కలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సోమవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం మండలం కొసగూడ గ్రామానికి చెందిన బి.దారుల్లిని భర్త మల్లేశ్వరరావు మందలించాడని మనస్తాపం చెంది చేతికి ఉన్న నాలుగు గాజులను చితక్కొట్టి మింగేసింది. ఈ విషయం భర్త చూసి గుమ్మలక్ష్మీపురం ఆస్పత్రికి ఆమెను తరలించగా ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మద్యం తాగవద్దన్నందుకు..



చికిత్స పొందుతున్న పున్నయ్య

పార్వతీపురం: మద్యం తాగవద్దని భార్య మందలించినందుకు మనస్తాపం చెందిన భర్త లైజాల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వీరఘట్టం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన జి.పున్నయ్య తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. తాగుడు మానమని భార్య రమ్య ఒత్తిడి చేయడంతో ఇంట్లో ఉన్న లైజాల్‌ను తాగేశాడు.


బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి



అప్పయ్యమ్మ మృతదేహం

పార్వతీపురం: పట్టణంలోని దీప్తి లాడ్జి సమీపంలో బైక్ ఢీకొనడంతో ఓ వృద్ధురాలు సోమవారం మృతి చెందింది. ఈ ప్రమాదంపై అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన వంగపండు అప్పయ్యమ్మ (78) దీప్తి లాడ్జి సమీపంలో రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందింది.

రికార్డు స్థాయిలో జీఎస్‌టీ ఆదాయం



ఏప్రిల్‌లో ద్రవ్య సేవాపన్ను ఆదాయం విశ్లేషణ

భువనేశ్వర్: ఈ ఏడాది ఏప్రిల్‌లో రాష్ట్రం రికార్డు స్థాయిలో ద్రవ్య సేవాపన్ను(జీఎస్‌టీ) ఆదాయం ఆర్జించింది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక ఆదాయంగా ఆల్ టైమ్ రికార్డు నెలకొల్పింది. ఏప్రిల్‌లో రూ.5035.74 కోట్ల స్థూల జీఎస్‌టీ వసూలు నమోదు చేసింది. ఓజీఎస్‌టీ, ఐజీఎస్‌టీ సమగ్ర జీఎస్‌టీ ఆదాయం 40.43 శాతం వృద్ధి నమోదు చేసింది. గత ఏడాది ఏప్రిల్‌లో రూ.1680.00 కోట్లు వసూలు చేయగా.. ఈ ఏడాది రూ.2359.17 కోట్లను ఆర్జించి రికార్డు సృష్టించింది. సేవలు, ట్రేడింగ్ రంగాల్లో ఏప్రిల్‌లో జీఎస్‌టీ వసూళ్లలో రికార్డు వృద్ధికి దారి తీసింది. పెట్రోలియం ఉత్పత్తులు, మానవ వినియోగం కోసం మద్యం నుంచి గత ఏడాది ఏప్రిల్‌లో రూ.264.42 కోట్లు ఆర్జించగా ఈ ఏడాది 13.52 శాతం వృద్ధి రేటుతో రూ.232.92 కోట్ల ఆదాయం నమోదైందంది. ఒడిశా కమిషనరేట్ పర్యవేక్షించే సీటీ, జీఎస్‌టీ, ఓజీఎస్‌టీ, వ్యాట్, ప్రవేశ పన్ను, వృత్తి పన్ను వంటి అనుబంధ చట్టాల కింద వసూలు ఈ ఏడాది ఏప్రిల్ లో 36.70శాతం వృత్తిరేటుతో మునుపటి ఆదాయం రూ.1947.21 కోట్ల పరిమితిని అధిగమించి రూ. 2661.92 కోట్లు ఆదాయం రికార్డు సాధించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో దాదాపు 20.23 లక్షల వే బిల్లులు దాఖలు కాగా.. గత ఏడాది ఇదే నెలలో వే బిల్లుల దాఖలు 17.57 లక్షలకు పరిమితమైంది.

జాతీయ టెన్నిస్ పోటీల్లో వెటరన్స్ సత్తా

విజయనగరం: జాతీయ స్థాయిలో జరిగిన టెన్నిస్ పోటీల్లో విజయనగరం వెటరన్ క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. గత నెలలో భీమవరం, విశాఖపట్నం ప్రాంతాల్లో జరిగిన ఆలిండియా సీనియర్ టెన్నిస్ చాంపియన్ షిప్, గ్లోబల్ సీనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం క్రీడాకారులు సన్యాసిరాజు, ఎంవీఎల్ఎన్ రాజు, రామారావు, మధు, సుధ, భాను టైటిల్ సొంతం చేసుకున్నారు. తాజాగా బెంగళూరులో ఏప్రిల్ 30న జరిగిన ఆలిండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సామిత్రి 45 సంవత్సరాల వయస్సులో డబుల్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. అలాగే అనకాపల్లిలో జార్జ్ క్లబ్ నిర్వహించిన ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్‌లో రామారావు, ఎంవీఎల్ఎన్ రాజు జోడి మొదటి స్థానంలో విజేతలుగా నిలిచారు. రెండు జాతీయ స్థాయి టోర్నమెంట్‌లలో విజయనగరం క్రీడాకారులు సత్తా చాటడంతో జిల్లా టెన్నిస్ అసోషియేషన్ ఆనందం వ్యక్తం చేసింది. క్రీడాకారులకు అభినందనలు తెలియజేసింది.



అనకాపల్లిలో జరిగిన పోటీల్లో రామారావు, ఎంవీఎల్ఎన్ రాజులనకాపల్లిలో జరిగిన పోటీల్లో రామారావు, ఎంవీఎల్ఎన్ రాజు

ప్రతీ ఆదివారం విహారయాత్ర స్పెషల్


పార్వతీపురంటౌన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో వేసవి సెలవుల దృష్ట్యా మే, జూన్ నెలల్లో పుణ్యక్షేత్రాలు, విహారయాత్రలు చేసేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ప్రజారవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ సోమవారం తెలిపారు. ఒకే రోజున వైష్ణవ క్షేత్రాలైన అరసవల్లి, శ్రీకూర్మం పుణ్యక్షేత్రాలను దర్శించుకొనేలా, కళింగపట్నం బీచ్‌లో విహరించేందుకు ప్రతీ ఆదివారం ఉదయం 6 గంటలకు పార్వతీపురంలో బస్సు బయలుదేరి సాయంత్రం 6 గంటలకు తిరిగి చేరేలా ప్యాకేజీ టూర్‌ను రూపొందించామన్నారు. దీనికి పెద్దలకు రూ.350, పిల్లలకు రూ.270లు చార్జీ చెల్లించాలన్నారు. ఆసక్తి గల వారు ఏపీఎస్‌ఆర్టీసీ ఆన్‌లైన్.ఇన్‌లో టికెట్లను బుక్ చేసుకోవాలని సూచించారు.

అల భోగాపురంలో...

- నాడు నా(రా)టకం.. నేడు జగ'నిజం'
- భోగాపురం విమానాశ్రయానికి నాటి చంద్రబాబు శంకుస్థాపన బూటకం
- తామే చేశామని 2019 సార్వత్రిక ఎన్నికల్లో చెప్పకోవడానికి తూతూమంత్రంగా కార్యక్రమం
- శిలాఫలకం ఆవిష్కరించిన భూమిసహా భూసేకరణ ప్రక్రియ వివాదాస్పదం
- కోర్టుల్లో వందల పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నా టెంకాయ కొట్టేసిన వైనం
- నాడు మోదీ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నా కానరాని అనుమతులు
- అంతా నాటకమని తెలిసే భూమిపూజకు జిల్లా టీడీపీ నాయకుడు అశోక్ డుమ్మా!
- అనుమతులన్నీ తెచ్చిందీ, అడ్డంకులన్నీ తొలగించిందీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే
- 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనకు ఏర్పాట్లు
- ప్రజల దృష్టి మరల్చడానికి టీడీపీ నాయకుల పాట్లు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి గత చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్ల పాలనాకాలంలో చేసిదేమిటో, ఈ నాలుగేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాధించిందేమిటో రికార్డు ఆధారాలు ఉన్నాయి. కానీ ప్రజల దృష్టిని మరల్చేందుకు టీడీపీ నాయకులు నానా పాట్లు పడుతున్నారు. కనీసం ఏ భూమిలో వేస్తున్నామో చూడకుండా శిలాఫలకం వేసేసి టెంకాయ కొట్టేమమ అనిపించిన చంద్రబాబుదే ఘనత అంటూ డబ్బా కొట్టుకోవడం వారికే చెల్లిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ప్రస్తుత విశాఖ విమానాశ్రయాన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మార్పు చేయడానికి వీల్లేని పరిస్థితుల్లో భోగాపురం వద్ద విమానాశ్రయం నిర్మించాలనే ప్రతిపాదన 2015 సంవత్సరంలో తెరపైకి వచ్చింది. గత టీడీపీ ప్రభుత్వం భూసేకరణకు బీజం వేసింది. 15 వేల ఎకరాలు సేకరిస్తామనడంతో భోగాపురం మండల రైతులు ఆందోళనలకు దిగారు. దీంతో ఐదు వేల ఎకరాలకు దిగొచ్చింది. పరిహారం ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున ప్రకటించడం, అసైన్డ్ భూములకు విస్మరించడంతో 2015 ఆగస్టులో రైతులు రోడ్డెక్కారు. అడ్డదిడ్డంగా తలపెట్టిన భూసేకరణను సవాలు చేస్తూ కొంతమంది హైకోర్టులో పిటిషన్లు వేశారు. వాటిపై విచారణ పెండింగ్‌లో ఉండగానే 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపించాయి. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం ఏమీ పూర్తి చేయలేదు. ఏదిఏమైనా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఘనత తనదేనని చాటుకోవాలని ప్రచారయావతో చంద్రబాబు 2019 ఫిబ్రవరి 14వ తేదీన హడావుడిగా శంకుస్థాపన చేయడం అప్పట్లో విమర్శలకు దారితీసింది.





భోగాపురం విమానాశ్రయ ఊహాచిత్రం ఇది.

2023 మే 3: వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి కార్యరూపం తీసుకొచ్చేందుకు నడుంబిగించారు. దీనికోసం త్రిముఖ వ్యూహం అనుసరించారు. ఇక్కడ 2,751 ఎకరాల భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయించారు. మరోవైపు రైతులకు తగిన నష్టపరిహారం, నిర్వాసితులకు పునరావాసం విషయంలో తన ఉదారతను చాటుతూ వారిని ఒప్పించారు. హైకోర్టు, సుప్రీం కోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్లన్నీ పరిష్కారమయ్యేలా చొరవ చూపించారు. అదే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా కేంద్ర మంత్రులను తరచుగా సంప్రదిస్తూ విమానాశ్రయానికి అవసరమైన అనుమతులన్నీ సాధించారు. అలా అడ్డంకులన్నీ అధిగమించడానికి, అనుమతులన్నీ తేవడానికి నాలుగేళ్ల కాలం పట్టింది. ఇక మార్గం సుగమమైన నేపథ్యంలో రానున్న రెండేళ్లలో నిర్మాణం పూర్తిచేసి, మూడో ఏట పూర్తిస్థాయిలో విమానాశ్రయం నుంచి విమానాల రాకపోకలను నిర్వహించాలనేది లక్ష్యం. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆ మరుక్షణమే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు జీఎంఆర్ సిద్ధంగా ఉంది. ఉమ్మడి విజయనగరం జిల్లా సహా ఉత్తరాంధ్ర దశాదిశా మార్చేసే, రాష్ట్రంలో బహుముఖ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు దోహదం చేసే

భోగాపురం పోర్ట్ పనులు ఇలా..

విమానాశ్రయ విస్తీర్ణం	2,203 ఎకరాలు
నిర్మాణ వ్యయం	రూ.4,592 కోట్లు
నిర్మాణ సంస్థ	జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్
విధానం	డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం)
పూర్తి సామర్థ్యం	ఏటా 4 కోట్ల (40 మిలియన్ల) మంది ప్రయాణికుల రాకపోకలకు వీలు
తొలి దశ	ఏటా 60 లక్షలు (6 మిలియన్ల) మంది ప్రయాణికుల రాకపోకలకు సౌకర్యం
రన్‌వే పొడవు	3.8 కిలోమీటర్లు
అదనపు ప్రత్యేకత	దాదాపు 5వేల చదరపు గజాల విస్తీర్ణంలో దేశీయ, అంతర్జాతీయ కార్గో టెర్మినల్
ఉపాధి	ప్రత్యక్షంగా లక్ష మందికి, పరోక్షంగా 5 లక్షల మందికి

ఫలించిన జగన్‌మోహన్‌రెడ్డి శ్రమ...

విమానాశ్రయానికి అవసరమైన అనుమతుల కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ స్థాయిలో చేసిన ప్రయత్నాలు ఫలించాయి. మరోవైపు క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్నారు. విమానాశ్రయ నిర్వహణకు, ఇతర అనుబంధ కార్యకలాపాలకు 2,750.78 ఎకరాలు సరిపోతాయని నిర్ణయించారు. పరిహారాన్ని భూమి పరిస్థితిని బట్టి ఎకరాకు రూ.28 లక్షల నుంచి రూ.36 లక్షల వరకూ అందించారు. అసైన్డ్ భూములకు కూడా జిరాయితీ భూమితో సమానంగా పరిహారం మంజూరు చేశారు. మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డకొండ అప్పలనాయుడు, భోగాపురం మండల నాయకుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి తదితరులు జరిపిన చర్చలతో చాలామంది రైతులు సానుకూలంగా స్పందించారు. కోర్టుల్లో పిటిషన్లను ఉపసంహరించుకున్నారు. మిగిలిన పిటిషన్లను హైకోర్టు, సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్ పరిష్కరించాయి. నిర్వాసితులైన నాలుగు గ్రామాల్లోని 404 కుటుంబాలకు అత్యుత్తమమైన పునరావాసప్యాకేజీని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించింది. దాదాపు రూ.80 కోట్ల వ్యయంతో టౌన్‌షిప్‌లను తలదన్నేలా రెండు కాలనీలను వారికోసం నిర్మించింది.



2019 ఫిబ్రవరి 14: భోగాపురం విమానాశ్రయం నిర్మాణానికి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆవిష్కరించిన శిలాఫలకం ఇది. ఐదేళ్ల పాలనా కాలంలో చేసిందేమీ లేకపోయినా సార్వత్రిక ఎన్నికలకు సరిగ్గా రెండు నెలల ముందు తూతూమంత్రంగా నిర్వహించిన కార్యక్రమం ఇది. నాటికి భూసేకరణ ప్రక్రియ కొలిక్కిరాలేదు. ఆ శిలాఫలకం వేసిన స్థలం సహా అంతా వివాదాస్పదమే. వందకు పైగా రైతులు వేసిన పిటిషన్లు కోర్టు విచారణలోనే ఉన్నాయి. నిర్వాసితులకు ఓ దారి చూపించలేదు. విమానాశ్రయం నిర్మాణానికి కేంద్ర మంత్రిత్వ శాఖల నుంచి అనుమతులేవీ రాలేదు. ఇదంతా ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఆడుతున్న నాటకమని తెలిసే జిల్లా టీడీపీ నాయకుడు, మోదీ ప్రభుత్వంలో విమానయాన శాఖ మంత్రిగా పనిచేసిన కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ఆ కార్యక్రమానికి ముఖం చాటేశారు.

అత్యాధునికంగా నిర్మాణం...

దాదాపు రూ.790 కోట్ల ఖర్చుతో సేకరించిన 2,750 ఎకరాల భూమిని ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థకు బదలాయించింది. అందులో విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన 2,203 ఎకరాలను నోటిపై చేస్తూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. రాజాం ప్రాంత వాసి, ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జునరావుకు చెందిన జీఎంఆర్ గ్రూప్ నిర్మాణ బాధ్యతలు తీసుకుంది. ఈ నెల 3వ తేదీన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి భూమిపూజ చేయనున్నారు.

క్లుప్తంగా

జూన్‌లో 'కన్యాకుమారి' విడుదలకు చర్యలు

● సినిమా డైరెక్టర్ దామోదర్



మౌత్ సెట్‌ను అర్చకుడికి అందజేస్తున్న దామోదర్

నరసన్నపేట: పల్లెటూరి ప్రేమ కథగా రూపొందించిన 'కన్యాకుమారి' సినిమాను జూన్ నెలలో విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని డైరెక్టర్ దామోదర్ (అట్టాడ సృజన్ కుమార్) తెలిపారు. సినిమాను శ్రీకాకుళం, నరసన్నపేట, గార పరిసరాల్లోనే చిత్రీకరించామన్నారు. లకిమేర గ్రామంలోని శివాలయంలో ఆయన సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మౌత్ సెట్‌ను ఆలయానికి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా సినిమాను తీర్చిదిద్దామన్నారు. హీరోగా నూతన నటుడు చరణ్ రాచకొండ పరిచయం అవుతుండగా.. హీరోయిన్‌గా గతంలో పుష్పక విమానంలో ఆనంద్ దేవరకొండ సరసన నటించిన గీతా శైనీ నటించారన్నారు. వారం క్రితం ఫైనల్ షెడ్యూల్ పూర్తయిందన్నారు. చిన్న చిన్న సన్నివేశాలు మినహా సినిమా పూర్తయిందని.. మరో వారం రోజులు షూటింగ్ ఉంటుందని వివరించారు. సినిమాకు సంగీతం సాహిత్య సాగర్, కెమెరా శివ గాజుల, సహనిర్మాతలుగా సతీష్‌రెడ్డి, వరీనియా మామిడి, సిద్ధార్థ వ్యవహరించారన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు కట్టాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల పరీక్ష ఫీజుల చెల్లింపు గడువు మే 3వ తేదీతో ముగుస్తుందని ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు తెలిపారు. ఇటీవలి వెలువడిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణులు కాని (ఫెయిలైన) విద్యార్థులతో పాటు తమ మార్కులకు పెంచుకునేందుకు (ఇంప్రూవ్‌మెంట్/బెటర్‌మెంట్) ఆసక్తి చూపే విద్యార్థులు పరీక్ష ఫీజును 3వ తేదీలోగా కళాశాలల్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫలితాలపై సందేహాలున్న విద్యార్థులు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆర్ఐఓ చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే నిర్దేశించిన ఫీజులను చెల్లించాలని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



ఆదిత్యుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: శ్రీ ఉషా పద్మిని ఛాయాదేవి అమ్మవార్లతో శ్రీసూర్యనారాయణస్వామి వారి కల్యాణోత్సవం సోమవారం ఉదయం స్థానిక అనివెట్టి మండపంలో ఘనంగా జరిగింది. వైశాఖ శుద్ధ (మతత్రయ ఏకాదశి) ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణ ప్రక్రియను ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. వెండి సింహవాహనంలో వేంచేపజేసిన కల్యాణమూర్తుల కల్యాణ సేవలో పలువురు భక్తులు రూ.500 చెల్లించి పాల్గొన్నారు. వీరికి స్వామి వారి శేషవస్త్రాలతో పాటు కల్యాణ తలంబ్రాలను అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఇప్పిలి సాందీప్ శర్మ పాల్గొన్నారు.

కమనీయం.. కూర్మనాథుని కల్యాణం



స్వామి కల్యాణమూర్తులకు హారతులిస్తున్న ఆలయ అర్చకులు

గార: శ్రీకూర్మనాథుని కల్యాణోత్సవం సోమవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా నిర్వహించిన కల్యాణ క్రతువును భక్తులు అధిక సంఖ్యలో తిలకించారు. ఆస్థాన మంటపంలో అలంకరించిన కల్యాణ వేదికపై కల్యాణమూర్తులను వేంచింపచేసి కల్యాణ ఘట్టాన్ని పండితులు ప్రారంభించా రు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, దాసుబాబు, శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, కిషోర్‌బాబులతో పాటు వేదపండితుల వేద మంత్రాల నడుమ కల్యాణోత్సవం జరిగింది. తొలుత విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పరిషత్, కంకణధారణ, కన్యాదానం, సుముహుర్తాన బెల్లంతో కలిపిన జీలకర్ర ధారణ జరిగింది. వేద పండితులు 'లోకరక్షణ హేతునా' అంటూ మంగళసూత్రధారణ, తలంబ్రాలు, మంగళహారతి మొదలైన కల్యాణ ఘట్టాలు కమనీయంగా జరిపారు.

విశిష్ట దర్శనం.. ప్రసాదం ఉచితం



పాలకమండలి సమావేశంలో సభ్యులు, దేవదాయశాఖ అధికారులు

● త్వరలో ఇంద్రపుష్కరిణి పనులకు శంకుస్థాపన
● అరసవల్లి ఆలయ పాలకమండలి తీర్మానం

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని ఆదివారాలతో పాటు పర్వదినాల్లో దర్శించుకునే సమయంలో అమలు చేస్తున్న విశిష్ట దర్శనం (రూ.500) టిక్కెట్టు తీసుకునే భక్తులకు ఇకపై లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా ఇవ్వాలని నూతన పాలకమండలి తీర్మానించింది. అలాగే త్వరలోనే ఇంద్రపుష్కరిణి అభివృద్ధి పనులకు రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావుచే శంకుస్థాపన చేయించేందుకు నిర్ణయించారు. స్థానిక ఆలయ ట్రస్ట్ బోర్డు మీటింగ్ హాల్‌లో పాలకమండలి చైర్మన్ ఇప్పిలి జోగిసన్యాసిరావు అధ్యక్షతన ఈవో వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో పాలకమండలి తొలి సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చ జరిగింది. తొలుత పాలకమండలి సభ్యుల అధికారాలు, బాధ్యతలపై దేవదాయ శాఖ చట్టం ప్రకారం ఉన్న నిబంధనలను ధర్మకర్తలందరికీ తెలిసేలా ఆలయ ఈవో హరి సూర్యప్రకాష్ వివరించారు. అనంతరం ఆలయ ఆదాయ వ్యయాలు, ఆస్తులు, బ్యాంకు డిపాజిట్లు, బంగారం, వెండి నిల్వల వివరాలను చదివి వినిపించారు. అనంతరం పలు అంశాలపై చర్చించి తీర్మానించారు.

ఆ వివరాలు ఇలా..

- స్వామి దర్శనానికి వచ్చే భక్తులందరికీ మంచి నీరు, ఉచిత ప్రసాదంతో పాటు భద్రతా చర్యలు, మరుగుదొడ్లు, ఇతరత్రా సౌకర్యాలు పక్కాగా జరగాలి
- ప్రస్తుతానికి జరుగుతున్న అభివృద్ధి పనులకు కొనసాగింపుగా ఇంద్రపుష్కరిణి రోడ్డు, దర్శనాల మార్గాల్లో జింకు రేకు షెడ్లను నిర్మించేందుకు దాతల సహకారాన్ని తీసుకోవడం
- కేశఖండన శాలలో తలనీలాల టిక్కెట్ ధర ఈ నెల ఒకటో తేదీ నుంచే 40 రూపాయలకు పెంపును అమలు చేస్తున్న క్రమంలో..విధుల్లో ఉన్న క్షురకులు తప్పనిసరిగా యూనిఫారాన్ని ధరించేలా చర్యలు
- ఇంద్రపుష్కరిణిని ఆకట్టుకునేలా ఆహ్లాదకరంగా అభివృద్ధి చేసే పనులకు త్వరలోనే మంత్రి ధర్మానచే శంకుస్థాపన చేయించాలని నిర్ణయం
- విశిష్ట దర్శన టిక్కెట్టుతో లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా ఇవ్వడంతో పాటు చిన్నపిల్లలకు పాలు, బిస్కెట్లను కూడా ఇచ్చేందుకు చర్యలు
- ధర్మకర్త మండవిల్లి రవి సూచన మేరకు అన్ని ఆదివారాల్లోనూ పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు పరిశీలన. పర్యవేక్షణ కోసం సిబ్బందికి విధుల బాధ్యతలు అప్పగించడం. ముఖ్యంగా అనధికార వీఐపీల దర్శనాలకు చెక్ పడేలా పకడ్బందీ చర్యలు తీసుకోవడం
- సమావేశంలో ఎక్స్ అఫీషియో సభ్యులు ఇప్పిలి శంకరశర్మ, ధర్మకర్తలు మండవిల్లి రవి, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, నెమలిపురి కోటేశ్వరరావు చౌదరి, ద్వారపు అనూరాధ, లుకలాపు గోవిందరావు, దుక్క గన్నిరాజు, జలగడుగుల శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మి, వాబ లోకేశ్వరి, జోగి మల్లెమ్మ పాల్గొన్నారు.

నగరీకరణ దిశగా పలాస

● రూపుదిద్దుకుంటున్న జంట పట్టణాలు
● లక్షకు చేరువలో జనాభా



పలాస కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయం

పలాస: జీడి పప్పు ఉత్పత్తిలో జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన పలాస మున్సిపాలిటీ దినదినాభివృద్ధి చెందుతోంది. జిల్లా కేంద్రం తర్వాత అంతేస్థాయిలో అన్నివిధాలుగా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా నగరీకరణ శరవేగంగా జరుగుతోంది. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లోని వ్యాపార సంస్థలు ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. సముద్ర తీరప్రాంతానికి అతి సమీపంలోని ఉద్దానం ప్రాంత అంచున ఉన్న ఈ పట్టణం విస్తీర్ణం కూడా విశాలంగా ఉంది. చుట్టూ ఎత్తైన కొండల నడుమ ఆహ్లాదకర వాతావరణం పట్టణానికి కొత్తశోభను తెస్తోంది. అంతే కాకుండా ఉత్తర, దక్షిణ దిశలో జాతీయ రహదారి, రైల్వే స్టేషన్ కూడా ఉండటంతో అనునిత్యం జనంతో కళకళలాడుతోంది. పెరుగుతున్న నగరీకరణకు అనుగుణంగా మూడు కిలో మీటర్ల మేర కె.టి.రోడ్డును 80 అడుగుల విస్తీర్ణంతో అభివృద్ధి చేస్తున్నారు. అలాగే వివిధ కార్పొరేట్ వ్యాపార సంస్థలు కూడా జంట నగరాల్లో వెలుస్తున్నాయి. ఒకప్పుడు చిన్న పంచాయతీలుగా ఉన్న పలాస, కాశీబుగ్గ ప్రస్తుతం 36 వార్డులతో గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా ఉంది. సుమారు లక్ష జనాభా మున్సిపాలిటీలోనే ఉంది. ఏడాదికి సుమారు రూ.11 కోట్లు వివిధ మార్గాల్లో ఆదాయాన్ని అర్జిస్తోంది. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా ఆర్డీవో కార్యాలయం, పోలీసు సబ్ డివిజన్, పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్లు కూడా ఉన్నాయి. మంత్రి డాక్టరు సీదిరి అప్పలరాజు కృషితో తరతరాలుగా ఉన్న మంచినీటి సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం లభించింది. రూ.700 కోట్లతో ఏర్పాటవుతున్న మంచినీటి ప్రాజెక్టుతో పట్టణ ప్రజల దాహార్తి కూడా పూర్తిగా తీరనుంది. అయితే పట్టణానికి ప్రధానంగా రైల్వే గేటు పెద్ద అవరోధంగా ఉండేది. ఇప్పుడు ప్లైఓవరు బ్రిడ్జి నిర్మాణం కూడా పూర్తి కావస్తోంది.

రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో గడిచిన రెండు సంవత్సరాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా చేపడుతున్నాం. ఇప్పటి వరకు రూ.6 కోట్లు నిధులతో వివిధ పనులు చేపట్టాం. పలాస నుంచి కాశీబుగ్గ వరకు రోడ్డు విస్తరణకు రూ.3 కోట్లు ఖర్చు చేశాం. దత్తాశ్రమానికి రూ.65 లక్షలు, నర్సిపురం సీసీ రోడ్డుకు రూ.40 లక్షలు, పెసరపాడు బీటీ రోడ్డు రూ.40 లక్షలతో పూర్తి చేశాం. మంత్రి సీదిరి అప్పలరాజు సహకారంతో మున్సిపాలిటీ రెండో కేటగిరీకి చేరుకుంది. రానున్న రోజుల్లో జంట పట్టణాలను మరింత సుందరంగా తీర్చుదిద్దుతాం.

– బళ్ల గిరిబాబు,
మున్సిపల్ చైర్మన్, పలాస-కాశీబుగ్గ

కొండెక్కి.. సమస్యలు తెలుసుకుని..



గిరిజన మహిళలకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

● హడ్డివాడలో గిరిజనులతో మమేకమైన ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: గిరి శిఖరంపై ఉన్న హడ్డివాడ గిరిజన గ్రామాన్ని కాలినడకనవెళ్లి అక్కడి గిరిజనంతో పాత పట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం మమేకమయ్యారు. మండలంలోని వెంకటాపురం గ్రామం నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలోని హడ్డివాడకు సరైన రోడ్డు లేదు. దీంతో కాలినడకన కొండపైకి ఎక్కిన ఆమె గిరిజనులను కలుసుకున్నారు. అందరినీ ఆప్యాయంగా పలకరించి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వ పథకాలు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలెక్కడుంటే అక్కడికి ప్రజాప్రతినిధులే వచ్చి బాగోగులు చూస్తారని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా రోడ్డు బాగోలేదని సమస్యను పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. దీనికి ఆమె స్పందిస్తూ త్వరలోనే రోడ్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, మండల నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, పోలాకి జయమునిరావు, సర్పంచ్ జయమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సరోజినమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాపారావు, రాజారావు, జమ్మయ్య పాల్గొన్నారు.

న్యాయమూర్తులను కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు



మూడవ అదనపు జిల్లా జడ్జి భాస్కరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం జిల్లా కోర్టులో నూతనంగా విధుల్లోకి చేరిన న్యాయమూర్తులను బార్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు సోమవారం మర్యాద పూరకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మూడవ అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం.ఫణికుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబలను వారి చాంబర్లలో బార్ ప్రతినిధులు కలిశారు. న్యాయమూర్తులను కలిసిన వారిలో బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు, జనరల్ సెక్రటరీ పొన్నాడ రాము, ఉపాధ్యక్షుడు గొంటి చంద్రమోహన్, సంయుక్త కార్యదర్శి నీలంశెట్టి చిన్నారావు, ట్రెజరర్ ఎల్.నారాయణ న్నారు.

ఆస్తి తగాదాపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్: ఆస్తి కోసం తల్లీ, కుమారుడు తగాదా పడ్డారు. దీంతో ఇరువురూ పోలీసులను ఆశ్రయించగా వేర్వేరుగా కేసు నమోదు చేసినట్టు ఒకటో పట్టణ ఎస్సై బలివాడ గణేష్ సోమవారం తెలిపారు. దమ్మలవీధిలో నివాసముంటున్న అల్లిబిల్లి రాధకు మొదటి భర్త కుమారుడు శ్రీకాంత్. ఈమె రెండో భర్త మధుబాబుతో కలిసి ఉంటుంది. శ్రీకాంత్‌కు వివాహమై మొండేటివీధిలో నివాసముంటున్నాడు. ఆదివారం రాత్రి ఇల్లు, ఆస్తి కోసం గొడవపడిన వీరు రాధ, మధుబాబులపై శ్రీకాంత్ దాడి చేసినట్టు చెప్పారు. అలాగే వారిద్దరూ శ్రీకాంత్‌పై కూడా దాడి చేశారన్నారు. దీంతో ముగ్గురూ రిమ్స్ ఆస్పత్రిలో చేరినట్టు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

పొందూరు: మండలంలోని కృష్ణాపురం సమీపంలో 2018 ఆగస్టు 1వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదానికి కారకులైన ఇద్దరికి జైలు శిక్ష పడింది. ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టిన ఈ ఘటనలో.. ట్రాక్టర్ డ్రైవర్ మునిసూర్యకు 2 ఏళ్ల జైలు శిక్ష రూ.6 వేలు జరిమానా విధించగా, ట్రాక్టర్ యజమాని లచ్చుభుక్త శంకర్‌కు 3 నెలల జైలు శిక్ష రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తు న్న జాడపేట గ్రామానికి చెందిన జాడ భాగ్య లక్ష్మి, కిలారి అనూరాధలు మృతి చెందారు. దీనిపై అప్పటి ఎస్ఐ బాలరాజు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణలు, వాదనలు పూర్తయిన తర్వాత రాజా సబ్ జడ్జి జస్టిస్ ఎం.బాబు తీర్పు వెల్లడించారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీ ప్రతినిధులు

● 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులు
● యూనియన్ ఏర్పాటు

శ్రీకాకుళం న్యూకాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లు అన్నారు. ఇటీవల ఉపాధ్యాయులుగా ఉద్యోగాల్లో చేరిన జిల్లాకు చెందిన వీరంతా సోమవారం శ్రీకాకుళంలోని ఓ కల్యాణ మండపంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి భవిష్యత్ కార్యాచరణతోపాటు సంఘటితం కావడానికి జిల్లాలో యూనియన్‌గా ఏర్పాటై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు సంఘ గౌరవ అధ్యక్షుడు జాక శ్యామ్‌సుందరరావు మాట్లాడుతూ.. 1998 డీఎస్సీ రిక్రూట్‌మెంట్ అనంతరం ఎన్ని ప్రభుత్వాలు మారిన తమను పట్టించుకోలేదన్నారు. ఎంతోమంది నాయకులను కలిసి తమ సమస్యను చెప్పుకున్నా పరిష్కారం కాలేదని చెప్పారు. ప్రజాసంకల్ప యాత్ర పేరిట ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మేలు చేస్తానని హామీ ఇచ్చారని.. ఇటీవల తమకు ఉద్యోగాలు ఇచ్చి మాటను నిలబెట్టుకున్నారన్నారు.

సీఎం జగన్ నిర్ణయంతో కొత్త జీవితం

ఇచ్చిన మాట ప్రకారం 1998 డీఎస్సీ బాధిత క్వాలిఫైడ్ అభ్యర్థులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో ఎట్టకేలకు కొత్తజీవితం మొదలైందని వారంతా సంతోషం వ్యక్తం చేశారు. తమ జీవితాల్లో వెలుగులు నింపడంతోపాటు తమ ఇంట దీపం పెట్టారని కృతజ్ఞతలు తెలుపుకున్నారు. అయితే ప్రస్తుతం ఎంతోమంది టీచర్లు పదవీవిరమణకు సమీపించారని.. సీఎం జగన్ మానవతా దృక్పథంలో 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల వయస్సును 62 ఏళ్లకు పెంచి మేలు చేయాలని విన్నవించారు. అలాగే 12 నెలల జీతం కల్పించాలని, కంట్రాక్ట్ ఎంప్లాయీస్‌ను క్రమబద్ధీకరించాలనే ఆలోచన ఉంటే తమను కూడా ఆ జాబితా పరిగణలోకి తీసుకోవాలని, హెల్త్‌కార్డులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నూతన కార్యవర్గం

1998 డీఎస్సీ ఎంటీఎస్ నూతన అధ్యక్షునిగా చిత్తరి మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా సాకేటి రాజగోపాల్‌నాయుడు, ఉపాధ్యక్షుడుగా మెట్ట భాస్కరరావు, కోశాధికారులుగా డీవీఎన్ పట్నాయక్, చల్లా సాయిబాబా, సంయుక్త కార్యదర్శిగా జె.కృపాకరరావు, ఎన్.సింహాచలం, బి.రాజేంద్రనాయుడు, సలహాదారుగా జి.నారాయణరావు ఎన్నికయ్యారు.

డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శృతి



బాధ్యతలు చేపడుతున్న శృతి

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం డీఎస్పీగా నియమితులైన వై.శృతి సోమవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఈమె 2018 గ్రూప్ వన్ బ్యాచ్‌కు చెందినవారు. ఇంటెలిజెన్స్ బ్యూరోలో కొన్నాళ్లు పనిచేశాక పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరులో డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈమె స్వగ్రామం విశాఖలోని గాజువాక. కాగా ఇక్కడ ఇప్పటి వరకూ పని చేసిన మహేంద్ర మాతే బదిలీపై వెళ్లారు. నూతనంగా విధుల్లో చేసిన డీఎస్పీ శృతిని సబ్‌డివిజన్ పరిధిలోని పలువురు సీఐలు, ఎస్సైలు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు.

మృతదేహంతో ఆందోళన

● ప్రమాదానికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేయాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబీకులు

పాతపట్నం: పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో స్నేహ షాపింగ్ మాల్ వద్ద గత నెల 30వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో పర్లాకిమిడికి చెందిన ట్రాక్టర్ మెకానిక్ బొరాడ వేణుగోపాల్ చనిపోయాడు. బైక్‌పై వెళ్తున్న ఈయన్ని కారు ఢీకొట్టడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఈయన మృతదేహానికి పాతపట్నం సీహెచ్‌సీలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను తక్షణమే అరెస్టు చేయాలని, కారును సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మృతుని బంధువులు, కుటుంబ సభ్యులు పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రి కూడలి వద్ద జాతీయ రహదారిపై మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఉదయం 11 నుంచి సాయంత్రం మూడు గంటల వరకు భారీవర్షంలోనే ఆందోళన చేపట్టారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. కొత్తూరు సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎస్సైలు, పోలీసులు ఆందోళన ప్రదేశానికి చేరుకున్నారు. అలాగే కాశీబుగ్గ డీఎస్పీ శివరామిరెడ్డి కూడా వచ్చారు. ఆందోళనకారులతో మాట్లాడి విషయాన్ని తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ప్రమాదానికి కారణమైన కారు, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని డీఎస్పీ చెప్పారు. అనంతరం డీఎస్పీ వేణుగోపాలరావు పర్యవేక్షణలో మృతదేహాన్ని పర్లాకిమిడి తరలించారు.

వర్షంతో మొక్కజొన్న రైతుల ఆందోళన

లావేరు:

మొక్కజొన్న రైతుల్లో మరోసారి ఆందోళన ప్రారంభమైంది. మండలంలోని చాలా గ్రామాల్లో మొక్కజొన్నను కోసేసి సిద్ధంగా ఉంచారు. పంటకు సరైన ధర లేకపోవడంతో అమ్మకాలు చేపట్టకుండా నిల్వచేశారు. ఈ పరిస్థితిలో సోమవారం కురిసిన వర్షంతో ఆందోళన చెందారు. మొక్కజొన్న కండేలు, గింజలు తడవకుండా పరదాలు కప్పి కాపాడుకోవడానికి ప్రయత్నించారు. వర్షాలు ఇంకా పడితే పరదాల కింద నుంచి నీరు వెళ్లే ప్రమాదం ఉందని, ఇదే జరిగితే కండెలు తడిసిపోయి మొలకలు వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కేశవరాయునిపురంలో మొక్కజొన్న కండెలు తడవకుండా పరదాలు కప్పిన దృశ్యం

ఒక్క రోజూ పనిచేయకుండానే..

సంతబొమ్మాళి: ఉపాధి హామీ పథకాన్ని కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు తమ జేబులు నింపుకోవడానికి వాడుకుంటున్నారని వేతనదారులు ఆరోపిస్తున్నారు. నౌపడ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నీలాపు ప్రసాద్ రెడ్డి, ఆయన భార్య లక్ష్మి (జాబ్ కార్డు నంబర్ 020255) ఒక్క రోజు కూడా ఉపాధి పనికి వెళ్లకపోయినా వారి ఖాతాలో రూ.94వేలు వేతనాల రూపంలో జమ అయ్యాయని స్థానిక ఉపాధి హామీ వేతనదారులు ఆరోపిస్తున్నారు. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్‌రెడ్డి ఖాతాకు సుమారు రూ. 41,236లు జమ కావడం విశేషం. పోలవరం బీసీ హాస్టల్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న సిద్దా ప్రమీల (జాబ్ కార్డు నంబర్ 010563) కూడా పనికి రాకపోయినా ఆమె ఖాతాకు రూ. 19, 725లు జమ అయ్యాయని, కె.లింగూడు పోస్టుమెన్‌గా పనిచేస్తున్న అంబలాం శ్రీనివాసరావు (జాబ్ కార్డు నంబర్ 020393) ఖాతాకు రూ.1169లు పడ్డాయని వారు తెలిపారు. బినామీల పేరున మస్టర్లు వేసి వాటాలు పంచుకుంటున్నారని, అలాగే ఉపాధి జాబ్‌కార్డు కావాలంటే రూ.300 చొప్పున ఫీల్డ్ అసిస్టెంట్ వసూలు చేశాడని కొందరు వేతనదారులు చెప్పారు. దీనిపై ఎంపీడీఓ ఉమాసుందరిని సంప్రదించగా.. ఉపాధి పనికి రాని వారి పేర్లు నమోదు చేయకూడదని, ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉపాధి వేతనం పొందడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. దీనిపై విచారణ చేపట్టి వాస్తవం అని తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.

చేయి..చేయి కలిపి..

మైదానాన్ని ఏర్పాటు చేసుకొని..



మైదానాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మందస: యువత తలచుకుంటే సాధించలేనిదేమి లేదని నిరూపించారు ఉద్దాన ప్రాంతమైన భేతాళపురం పంచాయతీ రట్టి గ్రామం యువకులు. ఉద్దానంలోని ఆదర్శ భావాలను మరింత ఇనుమడింపజేసే విధంగా పెద్ద క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రట్టి గ్రామానికి క్రీడా మైదానం కొరత వేధిస్తోంది. ఉద్దానంలో తోటలు ఎక్కువగా ఉండడంతో స్థలాభావం ఏర్పడింది. దీంతో యువకులు ముందుకు వచ్చి.. సుమారు నాలుగు ఎకరాల భూమిని గుర్తించారు. దీన్ని క్రీడా మైదానంగా తీర్చి దిద్దడానికి ప్రయత్నాలు చేశారు. స్థానిక సర్పంచ్ మామిడి సింహాద్రి, వివేకానంద యువజన సేవాసంఘం, యువకులు సుమారు రూ.10 లక్షలు నిధులతో క్రీడా మైదానం, క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేశారు. మూడేళ్ల పాటు శ్రమించిన యువత ఎట్టకేలకు గ్రౌండ్‌ను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సింహాద్రి, ఎంపీటీసీ సభ్యుడు సూరాడ వాసు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్, రట్టి గ్రామ అధ్యక్షుడు రాంజోగ, యువజన అధ్యక్షుడు రట్టి వైకుంఠ, ఉపసర్పంచ్ చీకటి మోహన్, సీనియర్ క్రీడాకారులు కృష్ణ, పీతాంబరం, సార దూర్వాసులు, రుద్రయ్య, ఓంకార్, దేవరాజు పాల్గొన్నారు.

ఎన్నేళ్లకు పెద పండగ వచ్చే..



సారవకోట: మండలంలోని కిన్నెరవాడ గ్రామంలో ఆదివారం నుంచి ప్రారంభమైన సిరిమాను ఉత్సవాల్లో భాగంగా సోమవారం 40 అడుగుల మానును భక్తులు మోసుకుంటూ గ్రామానికి తీసుకొచ్చారు. 14 ఏళ్ల తర్వాత గ్రామంలో నిర్వహిస్తున్న ఉత్సవంలో భాగంగా జలుమూరు మండలంలోని కత్తిరివానిపేట నుంచి సుమారు 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న కిన్నెరవాడ గ్రామానికి భక్తులు, యువత సిరిమానును తీసుకువచ్చారు. మార్గం మధ్యలో జలుమూరు మండలంలోని పలు గ్రామాలతో పాటు సారవకోట మండలంలోని బుడితి, చీడిపూడి, అవలింగి తదితర గ్రామాల మీదుగా వచ్చే సమయంలో ఆయా గ్రామాల మహిళలు పసుపు నీళ్లతో సిరిమానుకు పూజలు చేశారు. మంగళవారం సిరిమానోత్సవం జరగనుంది.